www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 1 మార్చి 2023

కర్రసాము పోటీల్లో 'ఏకలవ్య' విద్యార్థుల ప్రతిభ

పతకాలు సాధించిన క్రీడాకారులతో మాస్టర్లు

రాజంపేట అర్బన్: తమిళనాడులోని రాజాయపాలెం పట్టణంలో నిర్వహించిన 19వ జాతీయ స్థాయి కర్రసాము పోటీలలో రాజంపేట పట్టణానికి చెందిన ఏకలవ్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో సత్తా చాటారని మాస్టర్లు ఉద్దండపు బాలాజీ గణేష్, రెడ్డి ప్రవీణ్ తెలియజేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో రాజంపేట పట్టణం నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొనగా అందులో రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారని తెలిపారు. మినీ సబ్ జూనియర్స్ విభాగంలో డి.సహస్వి, సి.రుత్వికారెడ్డి రజత పతకాలు, జూనియర్ విభాగంలో వై.గంగాధర కాంస్య పథకం సాధించారని పేర్కొన్నారు. భారతదేశ సంప్రదాయ కళైన కర్రసాములో విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించడం పట్ల రాజంపేట వాసులు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పెరిగిన అరాచకాలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో వైసిపి అరాచకాలు పెరిగిపోయాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అధికారం ఉంది కదా అని ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. మంగళవారం రాత్రి స్థానిక ఎన్‌జిఒ హోంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుతో కలిసి సిపిఎం, సిపిఐ ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయన్నారు. వీటి అరికట్టాలంటే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు గెలిపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, నరసింహులు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జాబీర్, సిఐటియు, ఎఐటియు జిల్లా కార్యదర్శులు రామాంజనేయులు, సిద్ధగాళ్ల శ్రీనివాసులు, ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

యోగిపుంగవుడు 'జానమద్ది'

పంచసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్

ప్రజాశక్తి-కడప అర్బన్

తెలుగు భాషా సాహిత్యాల కోసం జీవితాన్ని అంకితం చేసిన సి.పి.బ్రౌన్ జ్ఞాపకార్థం విజ్ఞాన కేంద్రమైన బ్రౌన్ గ్రంథాలయాన్ని నిర్మించడం కోసం అహరహం తపించిన యోగిపుంగవుడు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని పంచసహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్ పేర్కొన్నారు. మంగళవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి నేతృత్వంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ నిర్మాత డాక్టర్ జానమద్ది నవమ వర్ధంతిని, స్మారకోపన్యాసాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో ముందుగా అతిథులంతా కలసి ప్రాంగణంలోని సి.పి.బ్రౌన్, జానమద్ది, సి.కె.సంపత్ కుమార్ విగ్రహాలకు, ఆ తర్వాత జానమద్ది చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన మేడసాని మోహన్ మాట్లాడుతూ జానమద్దితో తనకు చాలా అనుబంధం ఉందని, తాను 1978లో తిరుపతిలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు చదువుతున్నప్పుడు అక్కడ లెక్చరర్ల రెఫ్రెషర్ కోర్సు జరిగిన సందర్భంలో తాను అవధానం చేశానని, అప్పుడు మొట్టమొదట జానమద్దివారితో పరిచయం ఏర్పడిరదన్నారు. ఆ తర్వాత కడప జిల్లాలో తాను చేసిన పలు అవధాన సభల్లో జానమద్ది కూడా పాల్గొన్నారన్నారు. తన ఆధ్వర్యంలో అన్నమాచార్య ప్రాజెక్టు నిర్వహించిన పలు కార్యక్రమాల్లో కూడా జానమద్ది పాల్గొన్నారని తెలియజేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని, అవధాన విశిష్టతను, తాళ్ళపాక అన్నమయ్య కీర్తనల వైభవాన్ని, అల్లసాని పెద్దన కవితా మాధురిని తన మధుర గంభీర కంఠంతో వినిపించి శ్రోతలను రసపరవశులను చేశారు. సభాధ్యక్షులు, యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్ మాట్లాడుతూ జానమద్ది గొప్ప దార్శనికుడని, బ్రౌన్ గ్రంథాలయం భవిష్యత్తులో ఒక గొప్ప విజ్ఞాన కేంద్రంగా విలసిల్లుతుందని ఆయన ఆనాడే గ్రహించి బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధి కోసం జీవిత పర్యంతం శ్రమించారన్నారు. విశిష్ట అతిథి, శ్రీఅచలానంద ఆశ్రమం (బ్రహ్మంగారి మఠం) పీఠాధిపతులు స్వామి విరజానంద మాట్లాడుతూ జానమద్ది తన గురువైన అచలానందస్వామికి సన్నిహితులని, ఆ అనుబంధంతో ఆయన రచించిన అనేక వ్యాసాలు తమ ఆశ్రమం నిర్వహించే 'కాలజ్ఞానసుధ' పత్రికలో వచ్చాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ జానమద్ది బహుభాషాకోవిదుడని, తనకు ఆంగ్లం నేర్పిన గురువన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ గాడిచర్ల హరిసర్వోత్తమరావు, మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన తండ్రికి మార్గదర్శకులని, గాడిచర్లవారితో తన తండ్రి వయోజనవిద్యా ప్రచార కార్యక్రమంలో కూడా పాల్గొన్నారన్నారు. బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణం కోసం పడిన పాట్లను గురించి, అందుకు సహకరించిన అధికారుల గురించి తెలియజేశారు. సాహితీవేత్త ఎస్.ఈశ్వరరెడ్డి మాట్లాడుతూ జానమద్దితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని, తాను అనేక బ్రౌన్ గ్రంథాలయ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్టు సంయుక్త కార్యదర్శి ఎం.జానకిరామ్‌ను, సాహితీవేత్త ఎస్.ఈశ్వరరెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి, గోవిందరెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, డాక్టర్ పాలెం వేణుగోపాల్, జానమద్ది విజయలక్ష్మి, గానుగపెంట హనుమంతరావు, ఇలియాస్‌రెడ్డి, బాలఎల్లారెడ్డి, కె.వి.రమణారెడ్డి, రాజారెడ్డి, మాచిరాజు రమణయ్య, డాక్టర్ వెల్లాల వేంకటేశ్వరాచారి, నాగముని, లోకనాథం, బాలనాయుడు, ప్రతాపరెడ్డి, గురివిరెడ్డి, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, కొత్తపల్లి రామాంజనేయులు, మునికుమార్ పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు...తగ్గుముఖం

- ◆ భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం
- ◆ 1816 ఎకరాల్లోనే సాగు

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పొద్దుతిరుగుడు పంట సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. రైతులు పంట సాగుకు సుముఖత చూపడం లేదు. క్రమేనా రబీలో సాగు చేయాల్సిన పంట కనుమరుగవుతోంది. పంట సాగుకు అధిక ఖర్చులతో పాటు దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో రాకపోవడంలో రైతులు అనాసక్తి చూపుతున్నారు. జిల్లాలో సాధారణంగా వరి, వేరుశనగ, కంది, పొద్దుతిరుగుడు పంటలు రైతులు ఎక్కువగా సాగు చేసేవారు. ఈ రబీ సీజన్‌లో రైతులు పొద్దుతిరుగుడు పంటపై మొగ్గు చూపడం లేదు. జిల్లాలో పొద్దుతిరుగుడు సాగు తగ్గు ముఖం పట్టింది. ఎక్కువ పెట్టుబడి పెట్టి ఈ పంట సాగు చేసినా చేతికి వచ్చే సమయానికి తెగులు సోకి నష్టాల పాలవుతామేమోనని ఆందోళనతో రైతులు పెద్దగా ఆసక్తి చూడం లేదు. ఈ రబీ సీజన్‌లో జిల్లాలో సాధారణంగా పొద్దుతిరుగుడు పంట 2013 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా రైతులు మండల వ్యాప్తంగా 1816 ఎకరాల్లో సాగు చేశారు. రాయచోటిలో 6868 ఎకరాలు సాగు చేయాల్సిన అండగా 53 ఎకరాలు సాగు చేశారు. లక్కిరెడ్డిపల్లి 1480 సాగు చేయాల్సి ఉండగా 1515 ఎకరాలు సాగు చేశారు. రాజంపేట డివిజన్‌లో 369 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా 145 మాత్రమే సాగైంది. మదనపల్లి 34 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా 4.20 ఎకరాలు సాగు చేశారు. వాల్మీకిపురంలో 11 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా అస్సలు సాగే లేదు. ఎకరాకు ఖర్చు రూ.18 వేల నుంచి రూ.24 వేలు, దిగుబడి 5 నుంచి 8 క్వింటాళ్లు వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఖర్చులు అధికమై ఆశించిన స్థాయిలో పంట చేతికి రావడం లేదని రైతులు వాపోతున్నారు.

అధిక ఖర్చులు వస్తున్నాయి..

పొద్దుతిరుగుడు పంట సాగు చేయాలంటే అధిక ఖర్చులు వస్తున్నాయి. కూలీలు, ఎరువులు, ఇతర మందుల రేట్లు అధికంగా ఉన్నాయి. పంట ఆశించిన స్థాయిలో పంట రావడం లేదు.

- రామచంద్ర, రైతు, యండపల్లి, రాయచోటి.

సబ్సిడీ అందడం లేదు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న సబ్సిడీలు సకాలంలో అందడం లేదు. రైతులకు ఎరువులు మందులు సకాలంలో అందించాలి. ఈ క్రాప్ చేస్తున్న ప్రభుత్వం సక్రమమైన పద్ధతులు పాటించడం లేదు. కొన్ని గ్రామా, మండలాలలో ఈక్రాప్ చేస్తున్న రైతులకు ఫింగర్ ప్రింట్ తీసుకోలేదు. సిగ్నల్స్ సరిగ్గా రావడంలేదని సచివాలయ అధికారులు చెబుతున్నారు. ఈక్రాప్ చేయకపోతే ఆర్‌బికెలలో ఇస్తున్న సబ్సిడీ విత్తనాలు, ఎరువులు రైతులు అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రాప్ తో సంబంధం లేకుండా ఎవరైతే పట్టాదారు పాసుపుస్తకాలుంటాయో అలాంటి రైతులకు అన్ని సబ్సిడీలను అందజేయాలి.

- సి.రామచంద్ర, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

తక్కువ ఖర్చుతో సాగు చేసుకోవాలి..

రైతులు తక్కువ ఖర్చుతో సాగు చేసుకుంటే అన్నీ పంటలు అధిక దిగుబడి సాధించవచ్చు. ఎరువులు ఇతర మందులు సబ్సిడీతో రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతున్నాం. రైతులకు పంటలు పండించడానికి పొలంబడి శిక్షణ కూడా గ్రామాలలో కల్పిస్తున్నాం అదేవిధంగా పంట సాగు చేసిన ప్రతి రైతూ తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలి.

-ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయ అధికారి, రాయచోటి.

తవ్వా వెంకటయ్యకు సన్మానం

ఖాజీపేట : అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యునిగా నియమించబడిన మండలంలోని తవ్వారిపల్లె గ్రామానికి చెందిన తవ్వా వెంకటయ్యను ఆ గ్రామ పెద్దలు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆంజనేయ స్వామి ఆల యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సన్మానించి. అభినందించారు. టిడిపి మండలశాఖ అధ్యక్షులు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, రవీంద్రారెడ్డి, పెద్దబ్బి పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డివైఇఒ

అందుబాటులోకి ఐఎఫ్‌పిడి విధానం : డివైఇఒ

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వం అన్ని పాఠశాలల్లోకి 'ఇంటరాక్టివ్ ఫ్లాట్-ప్యానెల్ డిస్‌ప్లే' (ఐఎఫ్‌పిడి)ని అందుబాటులోకి తీసుకు రానుందని తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆనందరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక అయ్యప్పరెడ్డి కాలనీలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డివైఇఒ ముందుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.జయమ్మ అధ్వర్యంలో బోధనా సిబ్బందితో సమావేశమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఐఎఫ్‌పిడి అనేది పెద్ద ఫార్మాట్ టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే అని, ఇది తరగతి గదులకు చాలా అనువైనదని కూడా చెప్పారు. అధిక-నాణ్యత, డిస్‌ప్లే, మెరుగైన కనెక్టివిటీ, అంతర్నిర్మిత సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ఇందులోని ప్రత్యేకతని పేర్కొన్నారు. ఇది అస్తవ్యస్తమైన లేదా పాత ప్రొజెక్టర్ టెక్నాలజీకి ప్రత్యామ్నాయమన్నారు. 8వ తరగతి విద్యార్థులతో ఇంట్రాక్టె బైజుస్ ట్యాబును వారెలా వినియోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ట్యాబులపై విద్యార్థులకున్న అనుమానాలను నివృత్తి చేశారు. కేవలం పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాల కోసం ట్యాబ్‌లను అప్డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద విద్యార్థులకు ఆధునిక విద్యను అందుబాటులోకి తెచ్చిందని, కార్పొరేట్ పాఠశాలల స్థాయికి మించి ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతుందని అన్నారు. డివైఇఒ పిల్లల ప్రతిస్పందనపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్లోరి, ఝాన్సీరాణి, మధులత, వై.విజయ కుమారి, సుధారాణి, జానం సుజాత, శ్రీకళ, సౌజన్య, స్వర్ణలత, స్వప్నలత, జి.విజయకుమారి, ఉమామహేశ్వరి, ప్రసన్నలక్ష్మి, మెరీనా, సంపూర్ణ బోధ నేతర సిబ్బంది జూలీ, రేష్మ, అంజమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన డిఎస్‌సిని ప్రకటించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వం నూతన డిఎస్‌సిని ప్రకటించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.సుధాకర్‌నాయుడు, పురం వెంకటరమణ అన్నారు. యుటిఎఫ్ కమిటీలో నూతన కార్యదర్శులుగా ఎన్నికైన వారు మంగళవారం మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తప్పించి పూర్తి సమయం బోధనకే పరిమితం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా జెవివి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

జన విజ్ఞాన వేదిక 36వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ సమాజంలో పాతుకుపోయిన మూఢవిస్వాసాలను నియంత్రించడంతో పాటుగా నిరక్షరాస్యత నిర్మూలన, మద్యపాన నిషేధం, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత వంటి లక్షణాలతో జనవిజ్ఞాన వేదిక ఏర్పడిందన్నారు. పూర్వ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో సైన్సు ఫలితాలు ప్రజలకు చేకూరాలని సైన్సు ప్రజల జీవితాలలో విజ్ఞాన దీపిక కావాలని కోరుకునేవారందరూ ఒక గొప్ప ఆశయానికి శ్రీకారం చుట్టారని ఈ సమిష్టి కృషి ఫలితంగా 1988 ఫిబ్రవరి 28న విజయవాడలో జనవిజ్ఞన వేదిక ఆవిర్భవించిందన్నారు. ప్రతి ఏటా విద్యార్థులకు చెకుముఖి పోటీలు నిర్వహించడం, మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యపరచడం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, డాక్టర్ శ్రీలక్ష్మి, సిబ్బంది గోవిందమ్మ, రజిత, లావణ్య, భాస్కర పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జెవివి నాయకులు

కరపత్రాలు పంపిణీ చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉద్యమ నేపథ్యమున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఓటు వేసి గెలిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు పట్టణంలోని పలు విద్యా సంస్థలలో మంగళవారం ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులు పట్ల వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. ఉద్యమ నేపథ్యం కలిగిన పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుంటే ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులకు అండగా నిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.శివరామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, నియోజకవర్గ కార్యదర్శి మహమ్మద్ పాల్గొన్నారు.

రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు : డిసిసిబి సిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

కేంద్ర సహకార బ్యాంకులో రైతులకు తక్కువ వడ్డీకే రుణాలను ఇస్తున్నామని సహకార బ్యాంకు సిఇఒ రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని కేంద్ర సహకార బ్యాంకులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కార్ బ్యాంకులో వ్యవసాయ రుణాలు పొందిన రైతులు ఒక సంవత్సరంలోపు రుణాలను రెన్యువల్ చేసుకుంటే 7 శాతం, సంవత్సరం పైబడి రెన్యువల్ చేసుకుంటే 13 శాతం వడ్డీ పడుతుందన్నారు. బ్యాంకు ద్వారా రైతులు పొందిన దీర్ఘకాలిక రుణాలను కూడా రైతులు మార్చి నెల చివరిలోగా చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సహకార బ్యాంకు ద్వారా వ్యవసాయ రుణాలే కాకుండా స్వయం సహాయక సంఘాలకు రుణాలు, ఇంటి నిర్మాణాలకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో వాణిజ్య బ్యాంకులకు ధీటుగా కేంద్ర సహకార బ్యాంకులు కూడా పనిచేస్తాయన్నారు. డిసిసిబి సేవలను స్థానికులతో పాటు స్వయం సహాయక సంఘాలు, వ్యాపారులు, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. త్వరలో సహకార బ్యాంకులలో కూడా ఆన్‌లైన్ మొబైల్ బ్యాంకింగ్ యాప్ రాబోతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర సహకార బ్యాంకు ఎజిఎం నారాయణ, నోడల్ అధికారి శ్రీనివాసులు, మేనేజర్ ముంతాజ్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతకు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్ సమావేశంలో చేనేత రంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళ వారం తాడిపత్రి రోడ్డులో ఉన్న 19, 20 గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం సచి వాలయ అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సంద ర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తర్వాత అతి పెద్ద రంగం చేనేత అన్నారు. రాష్ట్రంలో సుమారు రెండు లక్షల మంది చేనేత కార్మికులున్నారన్నారు. చేనేతపై ఆధారపడిన ఉత్పత్తుల వారు అదనంగా మరో రెండు లక్షల మంది ఉన్నారన్నారు. ఇంత చరిత్రగల చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రెండు వందల కోట్లు మాత్రమే కేటాయించింది. ఆ డబ్బు కూడా నేతన్న నేస్తం లబ్ధిదారులకు ఎనభై వేల మందికి మాత్రమే సరిపోతుందన్నారు. చేనేత పరిశ్రమలకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. జిఎస్‌టి పేరుతో కేంద్ర ప్రభుత్వం చేనేతపై వేసిన పన్ను 46 శాతం ఉందన్నారు. దీనివల్ల రంగులు, రసాయనాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, నాయకులు దస్తగిరి, కమాల్‌బాషా, హాజీ, సుబ్బరాయుడు పాల్గొన్నారు

వైద్య సదుపాయాల పటిష్టతకు రూపకల్పన

జిజిహెచ్ హెచ్‌డిఎస్ సమావేశంలో కడప జిల్లా కలెక్టర్ వి.విజయ్‌రామరాజు

సమావేశంలో మాట్లాడుతున్న కడప జిల్లా కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న జిల్లా సర్వజన ఆసుపత్రి (జిజిహెచ్)ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని హెచ్‌డిఎస్ చైర్మన్, కడప జిల్లా కలెక్టర్ వి.విజయ్‌రామరాజు సభ్యులను ఆదేశించారు. మంగళవారం రిమ్స్ ప్రభుత్వ వైద్యకళాశాల బోర్డు మీటింగ్ హాలులో విజయ్‌రామరాజు అధ్యక్షతన 50వ ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కేవలం జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా రాయలసీమ స్థాయిలో కూడా ప్రజలకు అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. జిజిహెచ్ పరిధిలో ఇప్పటికే చాలా అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, కేన్సర్ రీసెర్చ్ ఆసుపత్రి, నేత్ర వైద్యశాల, మానసిక వైద్యశాలలు అందుబాటులోకి రానున్నాయన్నారు. రాయలసీమలోనే అత్యాధునిక వైద్య సేవలు అందించే మెడికల్ హబ్‌గా వైఎస్ఆర్ జిల్లా జిజిహెచ్ విస్తృత సేవలు అందించనుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యం దిశగా జిజిహెచ్ అభివృద్ధి సొసైటీ ముందుకెళుతోందన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల వైద్యాధిపతులతో ప్రతి నెలా సమావేశం ఏర్పాటు చేసుకుని సంబంధిత వార్డుల్లో కొరత లేకుండా అవసరమైన వైద్య పరికరాల కోసం ప్రతిపాదనలు సిద్ధంచేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వైద్య విభాగాధిపతులు కేవలం వైద్యం వరకే పరిమితం కాకుండా ఆయా విభాగాల్లో పరికరాల నిర్వహణ, యాజమాన్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. జిజిహెచ్‌లో ఉన్న అత్యంత విలువైన, అధునాతన వైద్యపరికారాలను నిర్లక్ష్యంగా ఉపయోగిస్తే సహించేదిలేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రుల్లో కంప్లైంట్ బాక్సులను ఏర్పాటు చేయాలని సొసైటీ సభ్యులను ఆదేశించారు. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సల సంఖ్యను పెంచాలన్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో అవసరమైన మందులను ప్రణాళికాబద్ధంగా నిల్వ ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను కూడా పటిష్టం చేయాలన్నారు. రక్తనిధి కేంద్రంలో అన్ని రకాల పేషంట్లకు అత్యవసరమైన అన్ని గ్రూపుల రక్తాన్ని అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో వహనాల పార్కింగ్ క్రమబద్ధీకరణ, సీసీ కెమెరాల నిరంతర నిఘా ఉంచాలన్నారు. వైద్య సిబ్బంది కోసం.. క్యాంటీన్ ను కూడా నిర్వహణలోకి తీసుకురావాలన్నారు. ఆసుపత్రిలో నిరంతారాయ విద్యుత్, ఇంటర్నెట్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిహెచ్ఎం కళాశాల విద్యార్థుల కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్ స్టేడియంను కూడా ఏర్పాటు చేసేందుకు సంసిద్ధంగా ఉన్నామని అందుకు అవసరమైన స్థలాన్ని కూడా చూడాలన్నారు. భవిష్యత్తులో జిజిహెచ్‌ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం జిజిహెచ్‌లోని అన్ని విభాగాల వైద్యాధిపతులతో కలెక్టర్ సమీక్షించారు. ఆయా విభాగాల్లో అవసరమైన వసతులు, సదుపాయాలు, వైద్య పరికరాలు, వైద్య సిబ్బంది తదితర అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కడప నగర కమిషనర్ జి.ఎస్.ఎస్.ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ వై.శ్రీనివాసులు, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ ఎ.బి.సురేంద్రనాథ్‌రెడ్డి, డిఎంహెచ్ఒ డాక్టర్ కె.నాగరాజు, ఎపి వివిపి డిసిహెచ్ఎస్ డాక్టర్ వై.హిమదేవి, నర్సింగ్ సూపరింటెండెంట్ మాధురి తదితర హెచ్‌డిఎస్ సభ్యులు, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శ్రీధర్, శ్వేతా, అన్ని విభాగాల వైద్యాధిపతులు పాల్గొన్నారు.

పుష్ప'గిరి' ప్రదక్షిణకు ఏర్పాట్లు పూర్తి

- ◆ నేడు గిరి ప్రదక్షిణకు పీఠాధిపతి ముహూర్తం
- ◆ 60 ఏళ్ల తరువాత గిరి ప్రదక్షిణ పునఃప్రారంభం


పుష్పగిరి దేవాలయం

ప్రజాశక్తి-వల్లూరు

ధార్మిక సంస్థలు, ప్రముఖుల సహకారంతో ఏర్పాట్లు పుష్పగిరిలో గిరి ప్రదక్షణకోసం యేర్పాట్లు ముమ్మరం చేశారు,పనులు సంతృప్తిగా సాగుతున్నాయి. తమిళనాడులోని అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు విశేష ప్రాచుర్యం ఉంది. సరిగ్గా అలాంటి కార్యక్రమమే పుష్పగిరిలో నిర్వహించాలని జిల్లాకు చెందిన కొందరు ధార్మికసంస్థల ప్రతినిధులు రెండు మాసాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మార్చి 1న ఈ కార్యక్రమం నిర్వహించాలని పుష్పగిరి ప్రస్తుత పీఠాధిపతి ముహూర్తం కూడా నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి తక్కువ సమయంలో ఏర్పాట్లు చేయవలసి ఉండడంతో నిర్వాహకులు కొండచుట్టూ దారి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. గిరిప్రదక్షిణ అనగానే మనకు సాధారణంగా అరుణాచలం గుర్తుకువస్తుంది. కడప జిల్లాలోని ప్రముఖ ఆధ్మాత్మిక క్షేత్రం, పర్యాటక ప్రాంతమైన పుష్పగిరి కొండచుట్టూ సుమారు 60 సంవత్సరాల క్రితం గిరి ప్రదక్షిణ జరిగేదని, దాన్ని పునరుద్ధరించడం ఈ క్షేత్రానికే కాకుండా జిల్లాకు అన్నివిధాలా శ్రేయస్కరమని పలువురు దార్మిక వేత్తలు బావిస్తున్నారు. కడప నగరానికి చెందిన న్యాయవాది, రాష్ట్ర దేవాలయాల పరిరక్షణసమితి సట్టి భారవి ఈవిషయంలో ప్రత్యేక చొరవ చూపుతున్నారు. పలువురు పండితులను కలిసి గిరిప్రదక్షిణ విషయాన్ని ధ్రువీకరించుకున్నారు. విషయాన్ని సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. జిల్లాకు మంచి జరిగితే తమకూ ఇష్టమేనని, ఈ విషయంపై పూర్తిగా సహకరిస్తామని పెద్దలు హామీ ఇవ్వడంతో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు ప్రారంభించారు. జిల్లా దేవదాయశాఖ అధికారులను ఆర్థిక సాయం కోరారు. పుష్పగిరి ప్రస్తుత పీఠాధిపతిని కలిసి ఈ విషయంపై చర్చించారు. మార్చి 1న పుష్పగిరిలో గిరి ప్రదక్షిణకు ముహూర్తం నిర్ణయించారు.

కొండచుట్టూ రోడ్డు : కొండ చుట్టూ జరుగుతున్న రోడ్డు నిర్మాణపనులు పూర్తి కావచ్చాయి. ప్రస్తుతం పుష్పగిరిలో నదిఒడ్డున కొండపై దేవాలయాలు ఉన్న కొండచుట్టూ గిరి ప్రదక్షనలు చేయాలని నిర్ణయించినా సరైన దారిలేకపోవడంతో తొలుత రోడ్డు నిర్మాణంపై దృష్టి సాధించారు. కొండచుట్టూ దాదాపు 12 కిలో మీటర్లు నడవాల్సి ఉండగా సగానికి పైగా మార్గంలో రాళ్లు, ముళ్ల పొదలు ఉండడంతో వాటిని శుభ్రంచేసి తాత్కాలికంగా రోడ్డు వేసేందుకు వివిధ యంత్రాలతో పనులు చేపట్టారు. జిల్లా నలుమూలల గ్రామాల్లో ప్రచారం చేసి ప్రదక్షిణ నాటికి పెద్ద ఎత్తున జనసమీకరణకు స్థానిక పెద్దల సహకారంతో ప్రయత్నాలు చేస్తున్నారు.

లోకేష్‌తో టిడిపి నాయకులు

లోకేష్ పాదయాత్రలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న కార్యక్రమంలో నారా లోకేష్, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, చంద్రగిరి టిడిపి నాయకులు పులివర్తి నాని లతో కలిసి కోడూరు టిడిపి నాయకులు టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర నాయకులు బొక్క సస్ సునీల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనను అంతం చేయడమే లక్ష్యంగా లోకేష్ పాదయాత్ర సాగుతుందని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువగళం పాదయాత్ర ఆగదన్నారు.

కంటిచూపుపై అశ్రద్ధ వద్దు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

విద్యార్థికి కంటిపరీక్షలు చేస్తున్న డాక్టర్ అర్జున్‌రెడ్డి

కంటిచూపుపై అశ్రద్ధ వహించ వద్దని కంటి వైద్యాధికారి కె.అర్జున్‌రెడ్డి అన్నారు. స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖబేగం ఆదేశాల మేరకు జాతీయ అంధత్వ నివారణ ప్రణాళికలో భాగంగా మంగళవారం రెడ్డివారిపల్లి ఆదర్శ పాఠశాలలోని ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాలలోని 352 మంది విద్యార్థులకు, సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సృష్టిలో ప్రతి జీవికి కంటి చూపు అతి ముఖ్యమైనదని సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు. శరీర భాగాలలో కళ్ళు అతి సున్నితమైనవని, కంటి చూపు కోల్పో కుండా ప్రత్యేక శ్రద్ధ కలిగుండాలని అన్నారు. కంటి చూపు మెరుగు పడడానికి విటమిన్ ఎ కలిగిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గ్రుడ్డు, చేపలు వంటి ఆహారాన్ని నిత్యం తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ టివి, సెల్‌ఫోన్ వంటి వాటితో ఎక్కువసేపు గడుపుతున్నారని, అటువంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కెఎస్ఎన్ మూర్తి, సిహెచ్ఒ మల్లిక, ఎంపిహెచ్ఇఒ రామచంద్ర, సూపర్వైజర్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌సి నందిని, ఎఎన్ఎం ధనుంజయమ్మ, ఆశా కార్యకర్తలు అరుణ, భాగ్యలక్ష్మి, రెడ్డమ్మ పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు తప్పనిసరి

నిమ్మనపల్లి : పశువులలో వచ్చే గాలికుంటువ్యాధికి టీకాలను తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి డాక్టర్ సాదుసురేష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవికాలంలో పశువులకు వ్యాధులు సోకకుండా పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సాధారణంగా పశువులలో వచ్చే గాలి కుంటు వ్యాధి నివారణకు పశు వైద్యుల సూచనలను పాడి రైతులు తప్పక పాటించాలన్నారు. పశువులలో గిట్టల మధ్యలో పుండ్లు, నాలుకపై బొబ్బలు రావడం గాలికుంటు వ్యాధి లక్షణాలని తెలిపారు. దీని వలన పశువులు మేత మేయక బక్క చిక్కిపోయి అనారోగ్యం బారిన పడుతాయని చెప్పారు. పాడి రైతులు అపోహలు వీడి ముందు జాగ్రత్తగా పశు వులకు టీకాలను వేయించాలన్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా 13100 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయని, మార్చి 1వ నుంచి 31 వరకు ప్రతి ఆర్‌బికె పరిధిలోని గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. టీకాలు వేయడం వలన రెండు రోజులు పాలు తగ్గడం సాధారణమే అని, తర్వాత యధావిధిగా ఆవు పాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున పాడి రైతులు అపోహలు వీడి పశువులకు వ్యాధి టీకాలు వేయించి విలువైన పశువులను కాపాడుకోవాలని తెలిపారు.

ఉచిత పశు వైద్యశిబిరానికి విశేష స్పందన

పెద్దమండ్యం : మండలం పరిధిలోని సిద్దవరం గ్రామం, మల్లయ్యగారిపలలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. ఈ పశు వైద్య శిబిరంలో 47 పశువులకు బ్యూటాక్స్ మందు పిచికారీ, ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు, 8 పశువులకు గర్భ కోశ వ్యాధులకు చికిత్స, 11 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహించారు. అనతరం పశు వైద్య అధికారి డాక్టర్ విక్రమ్ రెడ్డి మాట్లాతూ పశు విజ్ఞాన బడి కార్యక్రమం కింద పాడి రైతులకు పాలల్లో వెన్న శాతం పెంచుకోవడం ఎలా అనే అంశం మీద అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు రమణ నాయక్, మహేష్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ బూత్ తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను మంగళవారం కడప ఆర్‌డిఒ రంగస్వామి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉండాల్సిన సౌకర్యాల గురించి తహాశీల్దార్ దైవాదీనంను అడిగి తెలుసు కున్నారు. పోలింగ్ కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 69 ఓట్లు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీకి 1100 ఓట్లు ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటుహక్కును వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు, విఆర్‌ఎ, ఓటర్ల డేటా ఎంట్రీ ఆపరేటర్ నరేంద్ర పాల్గొన్నారు.

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్‌డిఒ రంగస్వామి

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-రాయచోటి

విద్యార్థులు చిన్ననాటి నుండే శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి కోరారు. జాతీయ వైజ్ఞానిక దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. వినూత్నంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు పలువురిని అబ్బురపరిచాయి. విద్యార్థులు వివిధ రంగులతో నేలపై వేసిన సైన్సు బొమ్మలు పలువురిని ఆకర్షించాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్‌తో సివి.రామన్ ప్రపంచ వైజ్ఞానిక రంగంలో భారతదేశపు కీర్తి బావుటాను ఎగుర వేసిన రోజు ఫిబ్రవరి 28 తేది అన్నారు. అందుకు గుర్తుగా ఫిబ్రవరి 28న దేశవ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత శక్తి వెలుగులోకి వస్తుందన్నారు. విద్యార్థులందరూ చిన్ననాటి నుండే సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో సాంకేతికతను కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు రామయ్య, నబీ రసూల్, రామకృష్ణ నాయక్, రవీంద్ర రాజు , విద్యార్థులు పాల్గొన్నారు. **పీలేరు :** విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంచుకుని గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలని విఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థల కరస్పాండెంట్ వి.మాధవి ఆకాంక్షించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత్రి వి.మాధవి, ప్రిన్సిపల్ సురేష్, అకడమిక్ ఇన్‌ఛార్జి బాబురెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **పెద్దమండ్యం :** జిల్లా ఉన్నత పాఠశాలలో ప్రధానోపాయులు గాజుల రామకృష్ణ ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహశీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం వలన శాస్త్ర పురోభివృద్ధిలో ప్రపంచ దేశాలలో భారతదేశం మొదటి స్థానంలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తల్లితండ్రుల కమిటీ చైర్మన్ ఈశ్వరమ్మ, ప్రధాన ఉపాధ్యాయలు రామకృష్ణ, ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్:** విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించు కోవాలని అన్నమాచార్య కళాశాల ఫార్మసీ ప్రొఫెసర్ పి.అనిత పేర్కొన్నారు. ప్రిన్సిపల్ బాలాజీ ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎజిఎం రమణయ్య, కో-ఆర్డినేటర్ కుటుంబరావు, డీన్ శివ శంకరయ్య, ప్రైమరీ ఇన్‌ఛార్జి శ్రీరామ్, సైన్స్ ఉపాధ్యాయులు రెడ్డయ్య, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **గాలివీడు :** ప్రతి విద్యార్థిలో దాగివున్న ప్రతిభను వెలికితీయాలని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓ.నిర్మల పేర్కొన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా పాఠశాల ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను సైన్సు ఉపాధ్యాయులు ఫైరోస్, రామామణి రాజేశ్వరిలు అభి నందించారు. **పుల్లంపేట:** జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా

గాలివీడు : సివి.రామన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

మండలంలోని పివిజిపల్లె జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపా ధ్యాయురాలు కృష్ణవేణి ఆధ్వర్యంలో సైన్స్ ఉపాధ్యాయులు ముప్పల శివశంకర్‌రాజు, గౌరీదేవి, గణిత శాస్త్ర ఉపాధ్యాయుని సుజితలు విద్యార్థులచే నిర్వహించిన సైన్స్, గణిత ప్రాజెక్టులు ఆకట్టు కున్నాయి. కార్య క్రమంలో ఉపాధ్యాయులురెడ్డి ప్రసాద్, గంగనపల్లి వెంకటరమణ, లక్కాకుల శ్రీనివాసులు, నూకల చంద్రకుమార్ పాల్గొన్నారు. **నందలూరు:** జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు స్థానిక నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శివశంకరరెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు ఎన్ఎస్ రెడ్డి, శివవరప్రసాద్, సరోజిని దేవి, రాగసుధ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. **వాల్మీకిపురం :** తన పరిశోధనలతో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన శాస్త్రవేత్త సర్ సివి రామన్.సేవలు నేటి తరానికి ఆదర్శమని ఎంఇఒ వెంకటరత్నం అన్నారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జాతీయ సైన్స్‌డే సందర్భంగా ప్రదర్శనలు నిర్వహించారు. భారతరత్న, నోబెల్ బహుమతి గ్రహిత సర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. **ములకలచెరువు :** పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి ప్రతిభ, నైపుణ్యాన్ని వెలికి తీయాలని తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాను పాఠశాల ఆవరణంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక శ్రీ జ్ఞానంబికా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా డాక్టర్ మల్లిఖార్జున రావ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, ఉదయ్, పురుషోత్తం, అమానుల్లా పాల్గొన్నారు. విద్యార్థి ని విద్యార్థులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నోబుల్ బహుమతి గ్రహీత డాక్టర్ సివి.రామన్ చిత్ర పటానికి పూలమాలలతో నివాళులర్పించారు.

దర్జీలకు రాయితీ రుణాలు ఇవ్వాలి

బి.కొత్తకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న దర్జీలు

ప్రజాశక్తి- బి.కొత్తకోట

దర్జీలకు రాయితీ రుణాలిచ్చి ఆదుకోవాలని కోరుతూ మంగళవారం పట్టణంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర టైలర్స్ వేర్ ఫైర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టైలర్స్‌డే ర్యాలీని నిర్వహించారు. వెంకటేశ్వర దేవస్థానం నుంచి ర్యాలీ జ్యోతిచౌక్, బస్టాండ్, బైపాస్ రోడ్ నుంచి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్ సంఘం ఏపీ స్టేట్ చీఫ్ ప్రమోటర్ గోవింద్ మాట్లాడుతూ రెడిమేడ్ దుస్తుల కారణంగా దర్జీలు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. ఈ ప్రభుత్వంలో అయినా దర్జీలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. టైలర్‌లకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ఇంటి వద్ద టైలరింగ్ చేస్తున్న మహిళలకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ మహిళకు ప్రభుత్వం ఉచితంగా కుట్టుమిషన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్, మండలం ఉపాధ్యక్షుడు వెంకటరత్నం చిన్న, కార్యవర్గ సభ్యులు రామచంద్ర, అమీర్, పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** ప్రపంచ టైలర్ల దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నేస్తం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు. అనంతరం స్థానిక గాంధీబస్టాండ్‌లోని గాంధీ విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి టైలర్ల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని, ఇప్పుడు ఆయన తనయుడు సిఎం వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఏటా రూ.10వేలు ఆర్థిక సాయంతో ఆదుకుంటున్నారన్నారు. టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్నీ సంక్షేమ పథకాలు తీసుకురావాలని కోరారు. టైలర్లు అందరూ కలిసికట్టుగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈశ్వర, రామక్రిష్ణ, రాము, అమీర్, గౌస్, బావజాన్, సుబ్రమణ్యం, విఠల, ఎస్‌కె బాష పాల్గొన్నారు.

పోషక ఆహారాన్ని పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

టిబి రోగులకు పోషకాహారం పంపిణీ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాయచోటి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు మరువలేనివి అందరికీ ఆదర్శనీయమని సిఐ వరప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో లయన్ అశోక్ రెడ్డి, లయన్ షేక్ మహమ్మద్, లయన్ శ్యామసుందర్ రెడ్డి, రెడ్డి కీర్తి సౌజన్యంతో మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టిబి యూనిట్ రోగులకు పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ మాట్లాడుతూ టిబి రోగులకు ఒక్కొక్కరికి రూ.700 చొప్పున 12మంది రోగులకు న్యూట్రీషన్‌ఫుడ్ అందించామన్నారు. టిబి వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ ఫుడ్ చాలా ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం సిఐ వరప్రసాద్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సేవలు ఎనలేనివని వీళ్ల సేవలను చూసి ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోని తమ వంతుగా ప్రజలకు ఉపయోగపడే సేవలు చేయాలని, అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి హరీష్ చంద్ర, నందిని ట్రావెల్స్ వినోద్ కుమార్‌నాయక్, హాస్పిటల్ సూపరిండెంట్ డా.నీలోఫర్ బేగం, వైద్యులు శ్రీనివాసరెడ్డి, సుభాషిణి, జీవన్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, టిబి యూనిట్ సూపర్వైజర్ హరి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు బిఎల్‌ఒలు కృషి చేయాలని తహశీల్దార్ కళావతి సూచించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 809 మంది ఓటర్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 13 మంది ఓటర్ల జాబితా నమోదు చేసినట్టు తెలిపారు. మండల కేంద్రంలో ఎంఆర్‌సి కార్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్ఐ రవి, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అరాచక పాలనను సాగనంపుదాం : ఆర్ఆర్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాష్ట్రంలో అరాచక అసమర్ధ పాలనను సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రమేష్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కొనంపేట, యర్రగుడి పంచాయితీలో కాలాడివాండ్లపల్లె, యర్రప్పగారిపల్లె, కె.వడ్డేపల్లె జరిగిన ఇదేంఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు,అరాచకాలు పెరిగిపోయాని చెప్పారు. వైసిపి పాలనకు నాలుగేళ్ళ పూర్తికావస్తున్నా రాష్ట్రంలో సామాన్య ప్రజలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు, చెత్త పన్ను, ఇంటి పన్ను విపరీతంగా పెంచేసి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి పాలనపై ప్రజలు విసుగు చెందారని, త్వరలోనే ఆ పార్టీకి చరమగీతం పాడుతారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, సర్పంచులు కేశవయ్య, లక్ష్మీ నారాయణ, ఉపసర్పంచ్ రాజాక్, యూనిట్ ఇంచార్జ్ రవిరెడ్డి, అజంతుళ్ళ, మాజీ ఎంపిటిసి గంగయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌లో బంగారు పతకం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో ఎస్.అఫ్రీన్ బంగారు పతకాలు సాధించిందని గురుదేవ వశిష్ఠ జూనియర్ కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్ వై.రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 20 నుండి 22 వరకు విశాఖపట్నంలో జరిగిన అండర్-19 ఎస్‌జిఎఫ్ రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో జిల్లా తరపున బాలికల విభాగంలో మా కళాశాల విద్యార్థి ఎస్.అఫ్రీన్ రెండు బంగారు పతకాలు, ఒక రజిత పతకం సాధించి ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. బాలుర విభాగంలో పి.కార్తికేయ కాంస్య పథకం కైవసం చేసుకున్నాడని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ రమేష్‌తో పాటు జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ సి.శారద అభినందించారు.

లోకాయుక్త ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి లోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సూపర్వైజర్‌గా పని చేస్తున్న అరుణకుమారి ఎస్‌సి కుల ధ్రువీకరణ పత్రంతో విధుల్లో చేరారని ఓ వ్యక్తి లోకాయుక్తకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఐసిడిఎస్ కార్యాలయంలో ఆర్‌డిఒ రంగస్వామి, ఐసిడిఎస్ పిడి ధనలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణలు పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి అనే వ్యక్తి అరుణకుమారి ఎస్‌సి కులధ్రువీకరణ పత్రంతో ఉద్యోగంలో చేరిందని ఇచ్చిన ఫిర్యాదుకు కలెక్టర్ కమిటీని ఏర్పాటు చేశారని, ఈ కమిటీ ద్వారా పరిశీలిస్తున్నట్లు ఆర్‌డిఒ రంగస్వామి తెలిపారు. అరుణ కుమారి కులదృవీకరణ పత్రంలో బిసి-బి ఈడిగ కులానికి చెందిన వారని, 2007లో విధుల్లో చేరారని, రికార్డులో మాత్రం బిసి కులానికి చెందినట్లు ఉన్నదని అధికారులు తెలిపారు. ఈమె కుల ధ్రువీకరణ పత్రంలో ఎలాంటి అక్ర మాలు లేవని అధికారులు తేల్చి చెప్పారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి నివేదికలు పంపుతామని ఐసిడిఎస్ పీడీ ధనలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సిడిపిఒ పద్మావతి, డిటి నరసింహులు, సిఐ వరప్రసాద్, ఎస్ఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిసి బ్యాంకు సిఇఒ రాజేంద్రకుమార్

రశీదులు లేనిదే డబ్బులు కట్టొద్దు

- డిసిసి బ్యాంకు సిఇఒ రాజేంద్రకుమార్

ప్రజాశక్తి-గాలివీడు

రశీదులు లేకుండా బ్యాంకులలో కానీ, సొసైటీలలో కానీ డబ్బులు కట్టొద్దని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సిఇఒ రాజేంద్ర కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక డిసిసిబి బ్యాంకును తనిఖీచేసి ఈ సందర్భంగా ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాహకార కేంద్ర బ్యాంక్ మన బ్యాంక్ అని రైతులు సక్రమంగా రుణాలు కట్టుకుంటూ పోతే రైతులపై భారం లేకుండా పోతుందని పేర్కొన్నారు. గాలివీడు సొసైటీలో రూ.1.80 కోట్లు బకాయిలు, నూలివీడు సొసైటీ బ్యాంకులో రూ.30లక్షలు బకాయి ఉన్నాయని పేర్కొన్నారు. మొండి బకాయలతో ఉన్న వాటిని ఉత్తేజ పరచడానికి, తన సిబ్బందిని కూడా తీసుకువెళ్లి సొసైటీలను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు సక్రమంగా రుణాల కట్టకపోతే వడ్డీపై వడ్డీ భారం పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతు కోసం ఉన్న బ్యాంకును రైతులు సద్విని చేసుకోవాలని సూచించారు. బంగారు రుణాలలో గాలివీడు బ్యాంక్ టాప్ వన్ లో ఉందని, మిగతా అన్ని బ్రాంచులు కూడా అభివృద్ధి చెందేలా చూసుకోవాలన్నారు. డిసిసి బ్యాంక్ ద్వారా చిరు వ్యాపారస్తులకు కూడా రుణ సౌకర్యం కల్పిసున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎజిఎం నారాయణరాజు, బ్రాంచ్ మేనేజర్ నారాయణరెడ్డి, సూపర్వైజర్ శివప్రసాద్‌రెడ్డి, క్యాషియర్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధి గ్రస్తులను ఆదరించండి

కలకడ : క్షయ వ్యాధిగ్రస్తుల పట్ల సానుభూతిని చూపి ఆదరించాలని జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు చిదంబరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సంబేపల్లి మండలం పెద్దపెడికిలో క్షయ వ్యాధితో బాధపడుతున్న బాబును పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధితో బాధపడుతున్న బాబునాయక్‌ను పరామర్శించి అతనికి కావలసిన పౌష్టికాహారం అందించి దత్తత తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబేపల్లి మండల ఉపాధ్యక్షుడు రవీందర్ నాయుడు, ఎంపిహెచ్ఒ శ్రీనివాసులు, ఎఎన్ఎంలు ప్రేమలత, గంగాదేవి, ఆశా వర్కర్లు రాజేశ్వరి, అనురాధ పాల్గొన్నారు.

శ్రీగంధం సాగుతో మెరుగైన రాబడి

ప్రజాశక్తి-కలికిరి

శ్రీగంధం చెట్ల సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి సమన్వయకర్త డాక్టర్ పాండురంగ తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రంలో శ్రీగంధం సాగుపై ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారి సహకారంతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీగంధం ప్రపంచంలోనే అత్యంత విలువైనదని, అలాగే శ్రీగంధం పొడి నూనెను కాస్మోటిక్, ఔషధాల తయారీలో వాడుతారని తెలిపారు. ముందుగా ఐ డబ్ల్యూఎస్‌టి సీనియర్ టెక్నీషియన్ ఎల్ మంజునాథ్, శ్రీగంధం నర్సరీ యాజమాన్యంలో పాటించాల్సిన పద్ధతులపై రైతులకు వివరించారు. గిరిబాబు శ్రీగంధం సాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. నర్సరీ నుంచి ఎలాంటి మొలకల్ని ఎంచుకోవాలి, మొక్కల పొడవు ఎంత ఉండాలి, నాటే పద్ధతి చెట్ల మధ్య దూరం ఎలాంటి మొక్కల్ని అతిధేయ మొక్కలుగా ఉపయోగించాలి, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం లాంటి అంశాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ కె.మాధురి, డాక్టర్ వై.పీరు సాహెబ్, ఎ.శ్రీనివాసులు, ఐడబ్ల్యూఎస్‌టిఎం మమత పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అత్తిరాల మడుగులో వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మృతుడు వెంకటేశ్వర్లు (ఫైల్ ఫోటో)

మండల పరిధిలోని అత్తిరాల మడుగులో మంగళవారం వ్యక్తి మృతదేహం లభించింది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలం వద్ద స్కూటీ, బట్టలు, ఆధార్ కార్డు లభించడంతో వాటి ఆధారంగా మృతుడు ఎన్‌టిఆర్ కాలనీలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుగా గుర్తించారు. సోమవారం నుంచి అతడు కనిపించకుండా పోయినట్లు సమాచారం. మడుగు వెలుపల లభించిన ఆధారాలను బట్టి రూరల్ పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అదృశ్యం పైన పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది హత్య లేక ఆత్మహత్య, ప్రమాదవశాత్తు మృతి చెందాడా అన్న విషయాలు దర్యాప్తులో తెలియాల్సి ఉంది. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

60 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలో అక్రమంగా నాటు సారాను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఫాతిమా తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని అగ్రహారం గ్రామానికి చెందిన కామిశెట్టి శ్రీనివాసులు గత కొంతకాలంగా అక్రమంగా నాటు సారాను విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. మంగళవారం హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి పోలీస్ సిబ్బందితో కలిసి అగ్రహారం సమీపంలోని చింతచెట్టు వద్ద గల నాటుసారా విక్రయ స్థావరంపై దాడులు నిర్వహించి కామిశెట్టి శ్రీనివాసులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్దనుంచి 60 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-కలకడ

జూదమాడుతున్న నలుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ఎర్రకోట పంచాయతీ కోపూరు వాండ్లపల్లె గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ.16,320 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడులలో పోలీసులు శ్రీనివాసులు, కాంతారావు, ఖలీల్, మహబూబ్ బాషా, రాజేంద్ర, హోంగార్డు గురవయ్య, రమేష్ పాల్గొన్నారు. **చిన్నమండెంలో..** మండలంలోని చిన్న నర్సిపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని వద్ద నుంచి నైజ95వేలు నగదు స్వాధీనం చేసుకొని పోలీసు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ బాబు పేర్కొన్నారు.

పాత కేసుల్లో ఏడుగురిపై బైండోవర్

ప్రజాశక్తి-కలికిరి

పాత కేసుల్లో ఏడుగురు నిందితులను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పాతకేసులు, సారా కేసుల్లోని ఏడుగురిని తహశీల్దార్ భాగ్యలత ఎదుట హాజరు పరచి బైండోవర్ చేపించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమములో ఎఎస్ఐ మధుసూదనాచారి, రైటర్ హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE Ist ADDITIONAL JUNIOR CIVIL JUDGE : MADANAPALLE

D.V.C.No. 62/2021

సి.స్వాతి. ...Petitioner

Vs

సి.నాగేశ్వర మరియు ఇతరులు. ...Respondents

నోటీసు టు రెస్పొండెంట్స్ 3 మరియు 4

To
R3. డి.భారతి, W/o డి.ఆనంద్,
R4. డి.ఆనంద్, S/o మంగమ్మ,
R/a రాయలవారిపల్లె, H/o ముడిపాలవేమల,పీలేరు మం॥, అన్నమయ్య జిల్లా.

పై దావాలెపి వాది. 3,4 ప్రతివాదులయిన వారి మీద గృహహింస కేసు వేయడమైనది. పై దావాను తేది:9/3/2023వ తేదీన ఉదయం 10 గం॥లకు, Ist అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మదనపల్లెలో హాజరు కావల సిందిగా వేసివున్నారు. కావున మీరు 1.డి.భారతి, 2.డి.ఆనంద్ గార్లపన కనిన తేదికి, గం॥లకు మీరు గానీ, మీ తరపు వకీలు గానీ హాజరై మీ అభ్యంతరములు దాఖలు చేసుకొనవలెను. లేని పక్షమున మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

P.RAM PRASAD MBA.,B.Ed.,L.L.B
Advocate,
MADANAPALLE,
Cell: 94405 39530.

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, మదనపల్లి.

I.A.No. 249 of 2021
O.S.No. 473 of 2021

ఆర్.గిరిజకుమారి. ...పిటిషనర్

Vs

బి.భాస్కర్ మరియు ఇతరులు. ...రెస్పాండెంట్స్

3వ ప్రతివాది :
బి.హేమావతి, W/o పరమహంస, డోర్‌నెం.-172, రామిరెడ్డిగారిపల్లి రోడ్డు, నక్కలదిన్నె, మదనపల్లి టౌన్.

పై దావా నందు వాది దాఖలు చేసిన ఇంజక్షను పిటిషన్ I.A.No.249 of 2021 నందు మీ హాజరు నిమిత్తమై మహారాజశ్రీ కోర్టు వారు 21.03.2023వ తేదీకి వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు నేరుగా గానీ లేదా మీ తరపున న్యాయయవాది ద్వారా గానీ పై కోర్టు నందు తేది.21.03.2023 ఉదయం 10.30 ని॥లకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున కోర్టు వారు తీర్మానించెదరని తెలియజేయడమైనది.

//By Order Of the Court//

D.MURALI KRISHNA B.A., L.L.B.,
Advocate,
MADANAPALLE,
Cell: 9700322274.

IN THE COURT OF THE Ist ADDITIONAL JUNIOR CIVIL JUDGE : MADANAPALLE

D.V.C.No. 43/2021

Kolle Susheela. ...Petitioner

Vs

Kolle Ravi Kumar & Others. ...Respondents

NOTICE TO RESPONDENTS 3&4

To,
R3. B.Dhanalakshmi, W/o B.Raghu
R4. B.Raghu, S/o Sankarappa
R/a Thippareddygaripalle Village, Cheekalabailu (Post), Madanapalle Mandal, Annamaiah District.

పై దావాలోని వాది ప్రతివాదులయిన వారి మీద Domestic notrace case వేయడమైనది. పై దావాను తేది:9.3.2023వ తేదీన ఉదయం 10గం॥లకు Ist Addl Junior Civil Judge, Madanapalle వారి కోర్టులో హాజరు కావలసిందిగా వేసివున్నారు. కావున మీరు 1.బి.ధనలక్ష్మి, 2.బి.రఘు గార్లు పై తేదీకి, పై గం॥లకు మీరు గానీ, మీ తరపు వకీలు గాని హాజరై మీ అభ్యంతరములు దాఖలు చేసుకొనవలెను. లేని పక్షమున మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

P. RAM PRASAD MBA.,B.Ed.,L.L.B
వాది తరపు లాయర్,
మదనపల్లె.